

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఉదయం** లేచేసరికి తొమ్మిదైంది. నిన్నటిలా టెన్షన్ పడలేదు. జర్నల్ ఆర్టికల్స్‌ని పూర్తిగా చదవలేదు. వాటిల్లో ప్రశ్నలు అడిగితే నా దగ్గర జవాబులేదు. మామూలుగా ఈ పాటికి నేను ఏడవాలి. కానీ ఎందుకో ధైర్యంగానే ఉన్నాను.

"కొంచెం సేపటిలో నేనే లేపుదాం అనుకున్నా నిన్ను" హనీష అంది.

"ఎందుకో పొద్దున మెలుకువ రాలేదు."

"నిన్న అంతా టెన్షన్ పడ్డావుగా, అందుకే అలిసిపోయి ఉంటావు"

నేను తయారయేసరికి హనీష నాకు దోసెలు వేసింది. తనకి వంట రాదని తెలిసినా, మరీ ఇంత దారుణంగా దోసెలు వేస్తుందని ఊహించలేదు. ఒకవైపు అంతా నల్లగా మాడిపోయింది. మరోవైపు అంతా పిండి పచ్చిగా ఉంది. అన్నిటికన్నా విచిత్రం – మా అమ్మ చెపాతీలని ఇండియా మాప్ షేపులో చేసినట్టు ఈ దోసెలకి ఓ మొదలు, ఓ చివర లేదు.

కష్టపడినందుకు అభినందించినా రుచి చూసే సాహసం చెయ్యి లేకపోయాను. తనూ అర్థం చేసుకుని నాతోపాటు నవ్వింది. ఇలాంటి దృశ్యం తిరిగి చూడలేనని డస్ట్‌బిన్‌లో పడేసే ముందు ఫొటో తీసాను. ఆ తరవాత "దోసెలు అలాకాదు వేసేది. నేర్పించనా?" అడిగాను.

"యా. నేర్పించవా ప్లీజ్" బదులిచ్చింది.

నాన్‌స్టిక్ పాన్‌ని స్టవ్ మీద పెట్టి "ముందు పెనం వేడెక్కాలి" అన్నాను.

"దోసెని వేసాక వెంటనే రౌండ్  గా తిప్పాలి" చూపించాను.

"వెంటనే స్టవ్‌ని సిమ్ లో పెట్టాలి. ఇప్పుడు చుట్టూ నూనె వేసి వెయిట్ చెయ్యాలి."

"ఎంతసేపు?" అడిగింది.

"ఒక పక్కన దోసె కొంచెం లేస్తుంది. అప్పుడు తీసెయ్యాలి" చూపించాను.

"ఉల్టా తిప్పాలా?"

"లేదు ఒకవైపే చాలు"

"ఇప్పుడు నేను వేస్తా" ఉత్సాహంగా  ప్రయత్నించింది. నేను పక్కనుండి సలహాలు, సూచనలు ఇస్తూ ఉన్నాను. రెండుసార్లు అలా దోసె వేసాక మూడోసారి నా సహాయం లేకుండా తనే చక్కగా వేసింది. ఇంతలో "హాయ్, బిజీగా ఉన్నట్టున్నారు" ఓ గొంతు వినపడింది.

"లేదు" తలతిప్పి హనీష అంది.

"హాయ్ అభిషేక్" కిచెన్‌లోంచి బయటికి వచ్చాను.

"హేయ్. హాయ్. ఎల్ ఆఅయింది నిన్న"

"ఫరవాలేదు. ఇవాళ మళ్ళీ రమ్మన్నారు."

"చెప్పారు. పొద్దున మాట్లాడారు నాతో. మనం సేం కాలేజ్ అని చెప్పాను."

"ఔనా? నువ్వు ఏ బ్యాచ్?"

"నేను మీ కాలేజ్ కాదు. ఆయనకి సేం అని చెప్పాను, నీకు జాబ్ ఇస్తారని."

"ప్రాబ్లం కదా తెలిస్తే?"

"నువ్వు ఏ కాలేజో కరెక్ట్‌గానే చెప్పు. నేను ఏ కాలేజో ఆయన ఎప్పుడూ అడగలేదు. ఇప్పుడు తెలిసినా చేసేదేం లేదు."

"ఓ..ఓకే"

"ఆయన ఇచ్చిన ఆర్టికల్స్ చదివావా?"

"అన్నీ చదవలేదు. కొన్ని అర్ధంకాలేదు. గూగుల్ చేసే ఓపిక లేదు" దీనంగా చెప్పాను. చెప్పిన తరవాత నా బద్ధకానికి బాగా సిగ్గుపడ్డాను.

"మొన్నంతా విపరీతంగా చదివింది. దాంతో నిన్న బ్రేక్ తీసుకుంది" హనీష నా మనసులో అనుకునంది విన్నట్టు సముదాయించింది.

"చూపించు, ఏం ఆర్టికల్స్ ఇచ్చారు?" అభిషేక్ అడిగాడు.

ఆయన ఇచ్చిన ప్రింట్ అవుట్లు తన చేతికి ఇచ్చాను. వాటిని పైపైన చూసి "ఇది నా రిసెర్చ్‌కి సంబంధించిందే" అంటూ ఎక్స్‌ప్లెయిన్ చేసాడు.

ముగ్గురం మాట్లాడుతూ దోసెలు తిన్నాం. ఆ తరవాత "నేను లాబ్‌కి వెళ్ళాలి" అభిషేక్ బయలుదేరబోయాడు.

"నేనూ వెళ్తా టైం అవుతుంది" హనీషతో అన్నాను.

"ప్రొపెసర్ దగ్గరికా?" అడిగాడు.

"ఔను."

"అయితే పద కలిసే వెల్దాం" అన్నాడు.

ఇద్దరం అటువైపు నడుస్తుండగా టెన్షన్ మొదలైంది.

"ఎలాంటి క్వశ్చెన్స్ అడుగుతారు?"

"పెద్దగా ఏం అడగరు. ఆయన చేసే రిసెర్చ్ గురించి నీకు ఎంత అవగాహన ఉంది, చేసే కెపాసిటీ ఉందా లేదా అని చూస్తారు, అంతే"

"నిన్ను ఏమడిగారు?"

"నన్ను ఉత్త బేసిక్ క్వశ్చెన్స్ అడిగారు. అయినా నేను తన క్లాస్ తీసుకున్నాను ఫస్ట్ సెమిస్టర్. మామూలుగా ఒక్క క్లాస్ అయినా తీసుకోవాలి. అప్పుడే టీఏ, ఆర్ ఏ జాబ్స్ ఇస్తారు."

ఏం బదులివ్వాలో తెలీక ఏం మాట్లాడలేదు.

"టెన్షన్ పడకు. మంచాయనే. మళ్ళీ రమ్మన్నారంటే జాబ్ ఇస్తారులే"

"ఓకే" అన్నాను. ఇంతలో తన లాబ్ వచ్చింది.

"నేను వెళ్తాను. నీకు తన ఆఫీస్ తెలుసా? అడిగాడు.

"యా. తెలుసు. థాంక్స్"

బిల్డింగ్‌లోకి వెళ్ళినప్పుడు మరీ అంత టెన్షన్ పడలేదు కానీ ఆయన గదివైపు నడుస్తుండగా నా గుండె చప్పుడు నాకే వినబడింది. గదిలోకి వెళ్ళి కూర్చున్నాక, అది రెండింతలైంది. ఆయనకి కూడా వినబడిందా అని ఒక చిన్న అనుమానంకూడా కలిగింది.

"డిడ్ యు రీడ్ ద మెటీరియల్స్?" అడిగారు.

"యెస్."

"వాట్ డు యు థింక్?"

"ఐ థింక్ ఇట్స్ వెరీ ఫాసినేటింగ్..." అభిషేక్ వివరించింది నా మాటల్లో చెప్పాను.

"సో యూ రెడ్ ఆల్ ఆఫ్ దెం?" అడిగారు.

"మోస్ట్ ఆఫ్ దెం" ఏమనాలో తెలీక గబుక్కున అన్నాను.

ఆయన చిన్నగా నవ్వి "డూ యూ నో వాట్ రిసర్చ్ వి డూ డైనామిక్స్ లాబ్?" అడిగారు.

అభిషేక్ నాకు చెప్పింది కొంత వివరించాను. దానిని ఆయన పూర్తి చేసారు. ఆ తరవాత కొన్ని చిన్న చిన్న ప్రశ్నలు అడిగి లాబ్‌ని చూపిస్తా అన్నారు. ఇద్దరం కలిసి ఇందాక అభిషేక్ వెళ్ళిన బిల్డింగ్‌లోకి వెళ్ళాము. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్నలాబ్‌లోకి ఆయన వెనకాల నడిచాను. నేను ఊహించినట్టు, టెక్స్‌టర్స్ లాబరేటరీలో లాగా టెస్ట్ ట్యూబ్స్, కెమికల్స్, పెద్ద పెద్ద మెషీన్లు రోబోలు లేవు. డెస్క్, కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయి. లాబ్‌లో ఉన్నవాళ్ళందరినీ పరిచయం చేసారు. ఇద్దరు అండర్‌గ్రాడ్ చదువుతున్నారు, మిగిలిన వాళ్ళు మాస్టర్స్, ఒకతను మాత్రం పిహెచ్‌డి. అండర్ గ్రాడ్‌లోనే ఇలా రిసెర్చ్ పని చేస్తున్నారంటే వాళ్ళు ఎంత ఇంటెలిజెంటో అని చాలా ఆశ్చర్యపోయాను. ఆ తరవాత తిరిగి ఆయన ఆఫీసు రూములోకి వెళ్ళాము.

ఆయన ఒక ఫార్మ్ ప్రింట్ చేసి దాని మీద ఏదో రాసి నా చేతికిస్తూ "ఆర్ యూ ఆన్ ఎఫ్ –1 వీసా?" అడిగారు.

"ఔనని" చెప్పాను.

ఆ ఫార్మ్ ని తీసుకెళ్ళి ఎంప్లాయ్‌మెంట్ ఎన్రోల్ అయ్యి పేపర్ వర్క్ పూర్తిచెయ్యమన్నారు .ఆ పని పూర్తయ్యాక తిరిగి వచ్చి కనపడమన్నారు. 'సరే' అని థాంక్స్ చెప్పి బయటకి వచ్చాను. మొదటి రెండు నిమిషాలు పేపర్ వర్క్ ఎలా చెయ్యాలా అని టెన్షన్ పడ్డాను. ఆ తరవాత హనీషని కానీ, అభిషేక్‌ని కానీ అడగొచ్చులే అని ముందు ఉద్యోగం వచ్చినందుకు ఆనందించాలని నిశ్చయించుకున్నాను. ఏం చెయ్యాలో తోచక వెంటనే అన్నయ్యకి ఫోన్ చేసాను. 'హలో' అన్న వెంటనే

"బిజీ ఆ?" అడిగాను.

"లేదు. లంచ్ టైం ఏంటి సంగతి?" మామూలుగా అడిగాడు.

"జాబ్ వచ్చింది" నా మొహం మీదనుండి నవ్వు చెరగలేదు.

"కంగ్రాచులేషన్స్ ఐ సో ప్రౌడ్ ఆఫ్ యు. ఎప్పటి నుంచి స్టార్?"

"తెలీదు. పేపర్ వర్క్ చేసాక రమ్మన్నారు"

"ఓకే. ఇమీడియెట్‌గా చేసెయ్యి. పోస్ట్ పోన్ చెయ్యకు .నీ రూమేట్‌ని అడిగి ఇవాళే మొదలుపెట్టు అన్నాడు.

"సరే ఇంటికి వెళ్ళగానే అడుగుతాను"

"రాత్రి సెలబ్రేట్ చేసుకో.ఇది ఒక మైనర్ అచీవ్‌మెంట్."

"ఇంకా స్టార్ట్ చెయ్యలేదుగా"

"ఫరవాలేదు. ఈ చిన్నవే మనం సెలబ్రేట్ చేసుకోవాలి. మన మిడిల్ క్లాస్ లైఫ్‌లో కెరీర్ సక్సెసే ఇంపార్టెంట్. లైవ్లీగా ఉండాలి. సెలబ్రేట్ చేసుకోవలిగేవి జీవితంలో వచ్చినప్పుడూ వదులుకోకూడదు. అవే అరుదుగా వస్తాయి."

"సరే. సెలబ్రేట్ చేసుకుంటా"

"గుడ్. ఈవినింగ్ కాల్ చేస్తాను. పని చెయ్యాలి. కంగ్రాచులేషన్స్ అగైన్"

"థాంక్స్" ఫోన్ పెట్టాను కానీ నవ్వు చెరగలేదు.

తలుపు తెరిచిన వెంటనే నా మొహం చూసి 'కంగ్రాచులేషన్స్' అంది హనీష. కొద్దిసేపు ఇంటర్వ్యూ గురించి మాట్లాడాక ఆయన ఇచ్చిన కాగితం చూపించాను.

"పద వెళ్ళి ఫినిష్ చేద్దాం" అంది.

దాంతో ఇద్దరం కలిసి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసాం. సాయంత్రం అవ్వడంతో మర్నాడు వచ్చి ఒక ఉత్తరం తీసుకుని ప్రొఫెసర్‌కి ఇవ్వమని చెప్పారు.

తిరిగి ఇంటికి కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ వెళ్ళాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story